తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గద్దం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
03 ఆగష్టు 2024
సంపుటి : 02
సంచిక : 59
పేజీలు : 10
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం




- నోటిఫికేషన్లు..పరీక్షలు.. తేదీల వివరాలు ప్రకటన
- అసెంబ్లీలో ప్రకటించిన డిప్యూటీ సిఎం భట్టి
- గతంలో అస్తవ్యస్త విధానాలతో నిరుద్యోగులకు నిరాశ
- ఇచ్చిన హామీ మేరకు ముందుకు వెళుతున్నామని వెల్లడి

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి -మిగతా 2 లో



## నీట్‌లో విస్తృతస్థాయి లోపాలు జరగలేదు

- లీక్ కేవలం బీహార్, జార్ఖండ్‌లకే పరిమితం
- పరీక్షను రద్దు చేయాల్సిన అసవరం లేదు
- మరోమారు కీలక వ్యాక్యలు చేసిన సుప్రీం

తరంగాలు-న్యూఢిల్లీ,

నీట్ యూజీ 2024 పరీక్ష ప్రశ్నపత్నం లీకేజీ వ్యవహారంలో సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షను రద్దు చేయాల్సిన అవసరం లేదంటూ ఇటీవల కీలక తీర్పునిచ్చిన ధర్మాసనం.. అందుకుగల కారణాలను వివరిస్తూ శుక్రవారం మళ్లీ తీర్పు వెలువరించింది. ఈసందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లోపాలను ధర్మాసనం ఎత్తిచూపింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది. నీట్ పేపర్ లీకేజీలో ఎలాంటి వ్యవస్థీకృత ఉల్లంఘనలు చోటుచేసుకోలేదు. పరీక్ష పవిత్రతను దెబ్బతీసేలా విస్తృత స్థాయిలో లీక్ జరగలేదు. ప్రశ్నపత్రం లీకేజీ ఝూర్ఖండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నా వరకే

-మిగతా 2 లో

## టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు



- తెలంగాణ సాధనలో వారి పాత్ర కీలకం
- 25వేలమందికి పదోన్నతులు కల్పించాం
- ఒకటో తేదీన జీతాలు పడేలా చేస్తున్నాం
- పేదల చదువుతోనే తెలంగాణకు భాగ్యం
- సర్కారీ బడికి వెళ్లడం ఆత్మగౌరవంగా భావించాలి
- పాఠశాలలకు ఉచిత విద్యుత్..మౌళిక వసతుల కల్పన
- ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో భేటీలో సిఎం రేవంత్

తరంగాలు హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే -మిగతా 2 లో

## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై లైంగిక దాడి



- 9వ తరగతి విద్యార్థి వికృత చేష్టలు
- స్కూలు ముందు చిన్నారి బంధువుల ఆందోళన

2



## మంత్రి సీతక్కపై మార్ఫింగ్ వీడియో

పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు

హైదరాబాద్,

సోషల్ మీడియాలో అసబ్యకర పోస్టులు సాధారణమయ్యాయి. సామాన్య మహిళలే కాదు మంచి హోదా, పరపతి ఉన్న వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పుడు ఏకంగా తెలంగాణ రాష్ట్ర మహిళా మంత్రిని సైతం వదలలేదు ఆగంతకులు. మంత్రి సీతక్కకు సంబంధించిన

-మిగతా 2 లో

## ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది



- మార్పు పేరుతో...ప్రజలను ఏమార్చలేరు
- జాబ్ క్యాలెండర్ పేరుతో మరోమారు మోసం
- ఉద్యోగాలు ప్రకటించకుండానే నిరుద్యోగుకలు మోసం
- గన్‌పార్క్ వద్ద నిరసనలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్

తరంగాలు- హైదరాబాద్,

మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ, -మిగతా 2 లో




## ధరణి పేరుతో నాటి ప్రభుత్వం దగా

- గుంట భూమి కూడా అమ్ముకోలేని దుస్థితి
- ప్రైవేట్ కంపెనీకి ధరణి అప్పగించడంతో సమస్యలు
- విదేశీ కంపెనీ చేతిలో తెలంగాణ భూముల వివరాలు
- బిఆర్‌ఎస్ నిర్వాకంతో రైతులకు శాపంగా మారింది
- ధరణిని భూమాతగా మార్చడంపై పొంగులేటి వివరణ
- గతంలో అనేక సమస్యలు వచ్చాయన్న సీతక్క
- అందరితో చర్చించే ధరణిని తెచ్చామన్న పల్లా

తరంగాలు-హైదరాబాద్,

ధరణి స్థానంలో భూమాతను తీసుకుని వస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేబినేట్ ఆమోదంతో దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ధరణితో గుంట భూమి కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పొంగులేటి ధరణి పై మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత న్యాయం జరుగుతుందని ప్రజలు విశ్వాసంలో ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం ధరణినీ ఐఎల్ ఎఫ్ కంపనీకి అప్పగించారని మండిపడ్డారు. కంపనీ కొన్ని కారణాలతో.. సింగపూర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగపూర్ కంపనీకి కేసీఆర్ తెలంగాణ భూములు తాకట్టు పెట్టారు అని మండిపడ్డారు. డిఫాల్ట్ -మిగతా 2 లో



## వయనాడ్ బాధితులకు చిత్రపరిశ్రమ అండ

భారీగా విరాళాలు ప్రకటిస్తున్న నటులు

చెన్నై, వయనాడ్ విషాదంతో యావత్ దేశం వణికిపోతోంది. కేరళలోని వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో 300 మందికి పైగా మరణించారు. మరో 200 మందికి పైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విపత్తుపై ప్రముఖులు కూడా స్పందిస్తున్నారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు లక్షల రూపాయలు విరాళంగా అందజేసి బాధితులకు సహాయం చేస్తున్నారు. వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు.. పలువురు ముందుకు వస్తున్నారు. ప్రముఖ తమిళ సినీ నటుడు సూర్య కుటుంబం వయనాడ్ బాధితుల సహాయార్థం రూ. -మిగతా 2 లో

తరంగాలు Tharangalu Daily News Paper RNI . TELTEL / 2022 / 83463

# జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

(మొదటి తరువాయి)

భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు
అధికారంలో ఉన్నా, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దు అయిందని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గందరగోళంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ లతో రెండు కమిటీలు ఏర్పాటు చేసి, వారి సూచనల్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి, 60 కొత్త పోస్టులతో మొత్తం 563 పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 3 లక్షల మంది హాజరుకాగా, పరీక్ష సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించామన్నారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక లక్షా 45 వేల 368 మంది హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఎగ్జామ్ కు 1 లక్షా 6 వేల 2 వందల 60 మంది హాజరుకాగా, విజయవంతగా నిర్వహించాం. 32 వేల 4 వందల 10 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చాం. 11 వేల 62 ఖాళీలతో టీచర్ రిక్రూట్ మెంట్ కోసం డీఎస్సీ ఎగ్జామ్ ప్రకటించాం. జులై 18న ప్రారంభమై ఆగస్టు 5న ముగియనున్నాయి. 465 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీకి, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. పరీక్షల ప్రిపరేషన్ కు తగినంత సమయం లేదని అభ్యర్థులు కోరడంతో ఆగస్టు నుంచి డిసెంబర్ కు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశాం. పరీక్షా తేదీలు ఒకటే కాకుండా, పరీక్షల మధ్య ప్రిపరేషన్ కు సమయం ఉండేలా అన్ని నియామక బోర్డులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాయని భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల పేపర్లు లీకయ్యాయి, పేపర్ల అమ్మకంతో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీక్ కారణంగా 2023 మార్చి 17న తొలిసారి గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దయింది. అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకోని కారణంగా హైకోర్టులో రెండోసారి ఎగ్జామ్ రద్దు అయింది. ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, కొత్త చైర్మన్ ను నియమించి వరుసగా పోస్టుల భర్తీని పూర్తి చేశాం. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎగ్జామ్స్ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నామని' భట్టి విక్రమార్క పేర్కొన్నారు.
ఇకపోతే షెడ్యూల్ ప్రకారం..వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ట్రాన్స్‌కోలోని వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు చేపడతారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు చేపడతారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జులైలో నిర్వహించ నున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది మేలో
మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు జరుపుతారు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు చేపడతామని ప్రకటనలో వివరించారు.

# టీచర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు

(మొదటి తరువాయి)

వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 25వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 30 వేల మందిని బదిలీ చేశాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు మీ ఖాతాలో పడేలా చూసే బాధ్యత మాది. ఈ సమ్మేళనంలో రాజకీయం, స్వప్రయోజనం లేదు. తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవం అని తల్లిదండ్రులు భావించాలి. అందుకు అందరం కలిసి కృషి చేయాలి. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తాం. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తాం.. ఆ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది. పేద పిల్లలు, దళిత వర్గాల పిల్లలు చదువుకుని బాగు పడితేనే రాష్ట్రం బలపడుతుంది. దిల్లీలో మూడుసార్లు కేజ్రీవాల్ గెలిచింది బస్తీల్లో పాఠశాలలు మెరుగుపరచడం వల్లే. మళ్లీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉండాలంటే మీరు పేదలకు చదువు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయు లను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు..మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం అన్నారు.

# నీట్‌లో విస్తృతస్థాయి లోపాలు జరగలేదు

(మొదటి తరువాయి)

పరిమితమైంది. దానిపై దర్యాప్తు జరుగుతోంది. అందుకే మేం పరీక్షను రద్దు చేయాలనుకోలేదు. అయితే, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయి. విద్యార్థుల భవితకు సంబంధించిన అంశంలో ఇలాంటివి చోటుచేసుకోవడం సరికాదు. ఈ సమస్యను కేంద్రం ఈ ఏడాదే పరిష్కరించాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్టీయేదేనని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈసందర్భంగా ఎన్టీయే పనితీరు, పరీక్షల్లో సంస్కరణల కోసం నియమించిన ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీకి సుప్రీంకోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్యానెల్‌ను మరింత విస్తరించాలని పేర్కొంది. పరీక్షా విధానంలో లోపాలను సరిదిద్దడానికి అవసరమైన చర్యలపై కమిటీ సెప్టెంబరు 30లోగా తమ నివేదికను అందజేయాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సాయం తీసుకోవాలని సూచించింది. ఈ నివేదిక అందిన తర్వాత అందులోని అంశాలను అమలుచేసే అంశంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రం, విద్యాశాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ ఏడాది నీట్ ప్రవేశపరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. దీంతో పేపర్ లీకేజీ, ఇతర అక్రమాలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం నీట్ యూజీ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని తీర్పు వెలువరించింది. మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది

# ధరణి పేరుతో నాటి ప్రభుత్వం దగా

(మొదటి తరువాయి)

కంపనీ కి ధరణి పోర్టల్ అప్పగించారని అన్నారు. బీఆర్ఎస్ చేసిన నిర్వాకం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఇద్దరు వ్యక్తులు కూర్చొని చేసిన చట్టం ధరణి అన్నారు. ఆల్ ఇన్ వన్ గా చెప్పుకున్న పెద్దాయన చేసిన నిర్వాకం ఇది అని తెలిపారు. ధరణి పేరుతో దగా చేశారన్నది నిజం అని అన్నారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రం.. ధృతరాష్ట్ర కౌగిలో ఇరుక్కుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండ నాలుక కి మందు వేస్తే ఉన్న నాలిక పోయినట్టుగా ధరణి ఉందని అన్నారు. 1973లో కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ చట్టం తీసుకొచ్చి పేదలకు భూములు పంపిణీ చేసిందన్నారు. వైఎస్ హయాంలో బీడు భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. ప్రజలకు మేలు చేసిన వారి పేర్లను ప్రస్తావించడం తగదన్నారు. భూసంస్కరణలతో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని చాలా మంది చెప్పారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉంది. ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భూసంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అనేక అంశాలు భూ సంస్కరణలతో ముడిపడి ఉన్నాయి. పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా భూసంస్కరణలు చేపట్టారన్నారు. ప్రపంచ చరిత్రలో నిలిచిన భూదాన ఉద్యమం ఇక్కడే పుట్టిందన్నారు. ధరణీ చట్టం మూడు తలలతో మొదలై.. 33 తలలతో అవతరించిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సమయంలో ఎక్కడికి వెళ్లినా ధరణీ సమస్యల గురించే ప్రజలు ఆయనకు వివరించారన్నారు. ధరణీని బంగాళఖాతంలో వేస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని గుర్తు చేసారు. ధరణీతో సామాన్యులు అవస్థలు పడ్డారని పొంగులేటి తెలిపారు. ధరణీ వచ్చిన తరువాత ప్రతీ గ్రామంలో సమస్యలే ఉన్నాయన్నారు. అప్పటి సర్కార్ పెద్దలు ధరణీ పేరుతో ప్రజలకు దగా చేశారన్నది ముమ్మాటికి నిజమన్నారు. ధరణీ సమస్యలతో రైతులు రోడ్డున పడ్డారు. చెప్పులు అరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని గుర్తు చేసారు.

# ప్రజలు తిరగబడే రోజు తప్పకుండా వస్తుంది

(మొదటి తరువాయి)

రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు. ఈ విషయం మీకు కూడా తెలుసని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు.. అయినా కూడా పిల్లల్లో ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి, శాసనభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన పద్ధతిలో నిన్న, మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు..

## లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారిపై లైంగిక దాడి

-9వ తరగతి విద్యార్థి వికృత చేష్టలు
-స్కూలు ముందు చిన్నారి బంధువుల ఆందోళన

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో దారుణం జరిగింది. ఉప్పల్ లోని లిటిల్ ఫ్లవర్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఓ బాలికపై లైంగిక దాడి చేశాడు ఓ బాలుడు. క్లాస్ రూంలోనే ఈ దాడి జరిగినట్లు ఆ చిన్నారి చెబుతోంది. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి రావటం సంచలనంగా మారింది. విషయం తెలిసిన చిన్నారి పేరంట్స్ స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. స్కూల్ లో ఇంత జరుగుతుంటే టీచర్లు ఏం చేస్తున్నారంటూ చిన్నారి పేరంట్స్, బంధువులు నిలదీస్తున్నారు. లైంగిక దాడి చేసిన బాలుడి వివరాలను స్కూల్ యాజమాన్యం రహస్యంగా ఎందుకు ఉంచుతుందని ప్రశ్నిస్తున్నారు. విషయం తెలిసిన పోలీసులు లిటిల్ ఫ్లవర్ స్కూల్ కు చేరుకుని విచారణ చేస్తున్నారు. టీచర్లతో మాట్లాడారు. బాలుడి వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. సున్నితమైన అంశం కావటంతో.. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్కూల్ గేట్లను మూసివేశారు. చిన్నారిపై 9వ తరగతి విద్యార్థి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఉప్పల్ ప్రముఖ స్కూల్ లో కలకలం రేపింది. రెండో తరగతి చిన్నారిపై 9 తరగతి విద్యార్థి అసభ్యంగా ప్రవర్తించాడు. చిన్నారితో వికృతి చేష్టలకు పాల్పడ్డాడు. దీంతో చిన్నారి తమ తల్లిదండ్రులతో విషయం చెప్పడంతో చిన్నారి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. స్కూల్ యాజమాన్యం స్పందించాలని ధర్నా చేశారు. దీంతో స్కూల్ మేనేజ్మెంట్ స్పందించి 9వ తరగతి విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించారు. స్కూల్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## వయనాడ్ బాధితులకుచిత్రపరిశ్రమ అండ

(మొదటి తరువాయి)

50 లక్షల రూపాయలను విరాళంగా అందించింది. అలాగే సూర్య భార్య జ్యోతికతో పాటు సూర్య సోదరుడు కార్తీ చేతులు కలిపారు. సూర్య, జ్యోతిక, కార్తీలను ప్రజలు అభినందిస్తున్నారు. ఈ మొత్తాన్ని సూర్య కుటుంబం సీఎం సహాయ నిధికి అందించింది. స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న వయనాడ్ బాధితుల సహాయార్థం కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళం అందించి ఉదారతను చాటుకుంది. అలాగే కోలీవుడ్ స్టార్ నటుడు విక్రమ్ కూడా 20 లక్షల రూపాయలు అందించారు. ప్రముఖ మలయాళ సినీ నటుడు మమ్ముట్టి కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి 25 లక్షల రూపాయల విరాళం అందించారు. మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్ 15 లక్షల రూపాయలు ఇచ్చాడు. మమ్ముట్టి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ట్రస్ట్ ముందుకొచ్చింది. బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, బట్టలు తదితరాలను కూడా అందజేస్తున్నారు. రూ. 25 లక్షల రూపాయలు ఇస్తానని మాలీవుడ్‌కు చెందిన ఫహద్ ఫాసిల్, అతని భార్య నజ్రియా నజీమ్ ప్రకటించారు. ఈ విపత్తులో ఇప్పటికే వేలాది మందిని రక్షించారు. మరికొంతమంది సినీ ప్రముఖులు కూడా వయినాడ్ బాధితులను ఆదుకుందుకు ముందుకు వస్తున్నారు. ఆదానీ లాంటి వారు ఇప్పటికే తమవంతు సాయం ప్రకటించారు.

## మంత్రి సీతక్కపై మార్ఫింగ్ వీడియో

(మొదటి తరువాయి)

వీడియోను కొందరు ఆగంతకులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. వీడియోని మార్ఫింగ్ చేసి సౌండ్స్ మార్చి ఎక్స్ ఖాతాలో సదరు ఆగంతకులు సర్క్యులేట్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది వెంకట నాయక్ ఫిర్యాదు చేశారు. అలానే మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కూడా మార్ఫింగ్‌పై కూడా ఫిర్యాదు చేశారు. రెండు వీడియోలను సర్కులేట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ వెంకట్ నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్వకేట్ వెంకట నాయక్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు మంత్రి సీతక్క వీడియో మార్ఫింగ్ అంశం తెలంగాణ అసెంబ్లీలో చర్చకు వచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సభలో ఏదో వీడియో తీసుకుని ఇష్టారాజ్యంగా పోస్టు చేస్తున్నారని, పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన మహిళా మంత్రిపై ఇలాంటి పోస్టులా అంటూ మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... పార్లమెంట్, అసెంబ్లీలో ఫోటోలు తీయడం నేరమని.. దీనిపై కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు.

## ప్రేరణ జాతీయ స్థాయి పోటీలకు జూకల్ విద్యార్థిని ఎంపిక



**తరంగాలు/ భూపాలపల్లి**
గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరంలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు జరిగే జాతీయస్థాయి వ్యాసరచన పోటీలకు భూపాలపల్లి జిల్లా నుంచి జూకల్ ఉన్నత పాఠశాల చిట్యాల కు చెందిన కొడారి స్రవంతి 10 వ తరగతి ఎన్నికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థి జాతీయ స్థాయికి ఎన్నిక కావడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ, గైడ్ టీచర్ సాదు మమత, ఉపాధ్యాయులు రాధికా రాణి, ఉమాదేవి, రంజిత్ కుమార్, స్వరూప, ఎండీ రఫీ రూపశ్రీ, పి రవీందర్,జి శ్రీనివాస్, యోగానంద చారి, రామకృష్ణ,ప్రసాద్,విద్యార్థిని అభినందించారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**-నైపుణ్యతను మెరుగుపరుచుకోవాలి**
**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
శిక్షణ ను సద్వినియోగం చేసుకొని నైపుణ్యం మెరుగుపర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్, నగరంలోని ఐటీ హబ్ ను సందర్శించి, నిర్వహిస్తున్న ఐటీ కంపెనీల కార్యకలాపాలను పరిశీలించారు.అనంతరం తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, లెర్నెట్ స్కిల్స్ జనరేషన్ సంయుక్తంగా చేపడుతున్న ఫుడ్ అండ్ బేవరేజ్ (స్టీవార్డ్) నైపుణ్య శిక్షణ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా శిక్షణ వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో మంచి విజయాలు సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు.వృతి నైపుణ్య విద్యలో సామర్థ్యాలు పెంపొందించుకోవాలన్నారు. సబ్జెక్టులో వెనుకబడకుండా ప్రయత్న లోపం లేకుండా దృష్టి పెట్టాలన్నారు.వృతి విద్యలో సామర్థ్యాలు సాధించడంతో పాటు తెలుగు,ఇంగ్లీష్ భాషలలో చక్కగా మాట్లాడడం, భావ వ్యక్తీకరణ శక్తిని కలిగి ఉండేటట్లుగా తయారవ్వాలన్నారు. తమ తమ సబ్జెక్టులలో విద్యార్థులకు బోధించేటప్పుడు తప్పకుండా బోధనోపకరణాలను ఉపయోగిస్తూ అర్థం చేయించాలని కలెక్టర్ అన్నారు. జీతం కోసం కాదు, జీవితం కోసం ఉద్యోగం ముఖ్యమని అన్నారు. చిన్న అవకాశం వచ్చినా వదులుకోవద్దని,పురోగతి వైపు మన లక్ష్యం ఉండాలని తెలిపారు. తాను పలు ఉద్యోగాలు మారి, ఈ స్థాయికి వచ్చానని,కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో అనేక పథకాలు చేపడుతున్నదని, వాటిపై యువత అవగాహన పెంచుకోని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లేకపోతే కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని ఆయన తెలిపారు. ఏ ఉద్యోగం వచ్చినా ముందడుగు వేయాలని, చిన్న పెద్ద తేడా లేకుండా ముందుకెళ్లాలని సూచించారు. మహిళలు పెద్ద ఎత్తున ఉద్యోగాలు పొందాలని అర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు.ప్రతి కుటుంబానికి ఉద్యోగం అవసరమని అవకాశాలను వినియోగించుకొని ఉద్యోగాలు పొందాలని అన్నారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వృత్తి విద్యలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు.కలెక్టర్ సందర్శన సందర్భంగా సెంటర్ రీజనల్ మేనేజర్ అశోక్ కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల 15ఏళ్ల కలని నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వం






**-ఎమ్మెల్యే -బి ఎల్ ఆర్**

**తరంగాలు మిర్యాలగూడ ప్రతినిధి**
శుక్రవారం హైదారాబాద్ ఎల్ బి స్టేడియం నందు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న సమావేశానికి బయలుదేరిన మిర్యాలగూడ ఉపాధ్యాయుల వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి - బి ఎల్ ఆర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే వారికి మేలు జరుగుతుంది అని భావించారు . కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి గత 10 ఏళ్ల పాలనలో ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాన్ని , వారు ఎదుర్కున్న ఇబ్బందులను గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 30 వేల మంది ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇచ్చి వారికి అండగా నిలిచారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మెరుగు పరచాలి అంటే ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకం కావున వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలి వారికి అండగా నిల్చుంటే వారి బాధ్యతలు కూడా సక్రమంగా నిర్వర్తిస్తారు అని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా ఉపాధ్యాయులు ప్రమోషన్స్ కోసం ఎన్నో సార్లు ప్రభుత్వానికి విన్నపించుకున్న గత బిఆర్ఎస్ ప్రభుత్వం చలించలేదు.. చివరిగా 2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు ప్రకటించారు మళ్ళీ ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక మా ఉపాధ్యాయులకు న్యాయం చేసారు అని వారు కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరియు బి ఎల్ అర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## కాటేపల్లి వద్ద విద్యార్థుల రాస్తారోకో






**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామం వద్ద మోత్కూరు - రాయగిరి ప్రధాన రహదారిపై బస్సులు ఆపకుండా పోవడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులకు సమయానికి చేరుకోక పోవడంతో విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతున్నందున తరగతులలో ఉపాధ్యాయులు చేప్పె పాఠాలు అర్థం కాకపోవడంతో విద్యార్థులు ఆగ్రహంతో శుక్రవారం రోజు కాటేపల్లి స్టేజీ వద్ద విద్యార్థులు రాస్తారోకో చేశారు. వారు మాట్లాడుతూ ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాల లకు వెళ్ళే విద్యార్థులకు అనుకూలంగా బస్సులను నడపాలని కోరారు. ఈ రాస్తారోకో చేస్తున్న విద్యార్థుల వద్దకు మోటాకోండుర్ పోలీసులు చేరుకుని విద్యార్థులకు సర్ధిచెప్పీ ధర్నా కార్యక్రమాన్ని విరమింప చేశారు.

## ఏసీబీ వలలో ఎస్సై, కానిస్టేబుల్

**-రూ.40 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్**



**తరంగాలు/వరంగల్ క్రైమ్:**
అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దూకుడు మరింత పెంచారు. లంచం పుచ్చుకుంటున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై వల విసురుతున్నారు. ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటున్న అవినీతిపరులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటున్నారు. తాజాగా వరంగల్ జిల్లా పర్వతగిరి పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్ స్పెక్టర్ గా పనిచేస్తున్న గుగులోతు వెంకన్న, కానిస్టేబుల్ సదానందం శుక్రవారం ఏసీబీ అధికారుల వలకు చిక్కారు. స్టేషన్ బెయిల్ ఇప్పించే విషయమై ఓ బెల్లం వ్యాపారి నుంచి రూ.40 వేలు తీసుకుంటూ ఎస్సై వెంకన్న, కానిస్టేబుల్ సదానందం అడ్డంగా ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. బెల్లంతో పట్టుబడిన వ్యాపారిని స్టేషన్ బెయిల్ కోసం కానిస్టేబుల్ సదానందం ద్వారా ఎస్ఐ వెంకన్న రూ.70 వేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రూ.20 వేలు బెల్లం వ్యాపారి ఫోన్ పే ద్వారా పంపారు. శుక్రవారం రూ.40 వేల నగదు బెల్లం వ్యాపారి ఇస్తుండగా స్వీకరిస్తున్న ఏసీబీ అధికారులు ఎస్సై వెంకన్న, కానిస్టేబుల్ సదానందంను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్సై, కానిస్టేబుల్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య ఆద్వర్యంలో ఈ దాడి జరిగింది. లంచం స్వీకరిస్తూ ఒక ఎస్సై, కానిస్టేబుల్ ఏసీబీ అధికారుల చేతికి చిక్కడం సంచలనం కలిగించింది.

## ట్రాక్టర్ ట్రాలీ దొంగిలించిన దొంగలు





**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో బొబ్బల ఇంద్రారెడ్డి యొక్క ట్రాక్టర్ ట్రాలీ డబ్బా నెంబర్ TS 303106 ట్రాలి కలర్ ఎరుపు రంగు కలది. తేది 1- 8-2024 రోజు రాతి) గుర్తు తెలియని దొంగలు ఎతుకెల్లినారు . ఎవరికైనా మీ యొక్క గ్రామాలలో గుర్తించి ఆచూకి తెలియజేసిన వారికి తగిన పారితోషకం ఇవ్వ బడును. మరియు వారి పేరు గోప్యంగా ఉంచబడును. తెలియపరచుట సెల్ నెంబరుకు 9866986127 సమాచారం ఇవ్వగలరు అని కోరారు.

## కోతులు, కొండ ముచ్చులు కుక్కల భారీ నుండి రక్షణ కలిపించండి





**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో కోతులు, కొండ ముచ్చులు, కుక్కల నుండి రక్షణ కలిపించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రతి శుక్రవారం ఫ్రై డే - డ్రై డే



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో శుక్రవారం రోజు ఫ్రై డే డ్రై డే ను పురస్కరించుకొని ఇందిరా నగర్ కాలనీ వివిధ వీధుల వెంబడి పర్యటించి పలు ఇళ్లలో నీరు నిల్వ ఉన్న గోళాలు, డ్రమ్ములు, కుండలను పరిశీలించి వాటిలో నివాసం ఉండే దోమలు ఈగలు అవి చేసే జీవన ప్రక్రియలు వ్యాధుల పట్ల స్థానిక ప్రజలకు అవగాహన కల్పించిన మండల ఎంపిడిఓ రాములు నాయక్ , మండల హెల్త్ ఆఫీసర్ వంశీకృష్ణ , పంచాయతీ కార్యదర్శి ఆనంద్ కుమార్ , హెల్త్ సూపర్వైజర్ అజీజ్ , ఏఎన్ ఎం కృష్ణవేణి , బిల్ కలెక్టర్ సుదర్శన్ , ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపురం గ్రామంలో ఫ్రైడే డ్రైడే

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం గ్రామాల్లో నీటి నిల్వలను లేకుండా చూసుకోవాలి అన్నారు.నీటి నిలువ ఎక్కువ రోజులు ఉంటే దోమలు వస్తాయి. దోమలవల్లా కలిగే ఇబ్బందులు గురించి ప్రజలలో అవగాహన కల్పిస్తూ తిమ్మాపురం గ్రామ పంచాయతీలో చేపట్టిన "ఫ్రైడే డ్రైడే " కార్యక్రమంలో టీపీ డి శ్రీశైలం గౌడ్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి శిరీష, ఎఫ్ఏ ఎన్ రవిందర్ రెడ్డి, ఆశకార్యకర్త ఆర్ రజిత, అంగన్వాడీ ఆయా ఎండీ నస్రీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది కోల మచ్చగిరి, వేముల రాములమ్మ, బట్టు బిక్షపతి, గ్రామంలోని ఆయా ఇంటి యాజమానులు, తదితరులు పాల్గొన్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI. TELTEL/2022/83463

# ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ ఉద్యమానికి సుప్రీం కోర్టు న్యాయం చేసింది




**–డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

**తరంగాలు ప్రతినిధి /హనుమకొండ :** భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ ,ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సంచలన న్యాయ తీర్పు ఇచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మార్పిస్ లో స్టూడెంట్ గా..రాష్ట్ర డాక్టర్స్ ఫోరమ్ కన్వినర్ గా పనిచేసినందుకు గర్వంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన మంత్రి నెహ్రూ విదేశాలనుండి ఎవరు మన దేశానికి వచ్చిన కూడా నెహ్రూ జ్ఞానవంతులు అయిన అంబేద్కర్ కి పరిచయం చేసి దేశ వ్యవహారాలను చూడమనేవారు. కాంగ్రెస్ పార్టీ దళితులు పేద వర్గాల ను అభివృద్ధి చేసి దేశాన్ని అభివృద్ధి వైపు నడవాలంటే రాజ్యాంగం రాయడం అంబేద్కర్ ద్వారానే సాధ్యమని రాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీది కాబట్టి ఆ చట్టాలు మరియు రాజ్యాంగం ద్వారానే అన్ని వ్యవస్థలు పనిచేస్తున్నాయాన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేయడం మంచి పరిణామం అన్నారు.విద్యా ఉద్యోగాలలో వర్గీకరణ అవసరమని ఎమ్మార్పిస్ మంద కృష్ణ ,సునీల్ తదితరుల కృషి ద్వారా సుప్రీంకోర్టు సంచలమైన తీర్పునిచ్చారు . అంబేద్కర్ కల్పించిన చట్టం రాజ్యాంగం ద్వారానే వర్గీకరణ సాధ్యం అయ్యిందని, జనాభా ప్రకారం ఎస్సీలకు 19శాతం తెలంగాణ రాష్ట్రము లో 10శాతం మాదిగలకు, మాలలకు మరియు ఉపకులాలకు జనాభా ప్రకారం సమన్యాయం చేస్తారని కాంగ్రెస్ పార్టీ మీద పూర్తి విశ్వాసం ఉందని రామకృష్ణ అన్నారు. ఎస్సీ ,ఎస్టీ లో ఉన్న ఉపకులలన్నిటిని సమన్యాయం చేయాలంటే ఈ తీర్పును స్వాగతిస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ విషయం మై నిండు సభలో నోటిఫికేషన్లు ఇచ్చిన వాటిల్లో కూడా ఎస్సీ,ఎస్టీ ఏ బి సి డి వర్గీకరణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పడం చాలా ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు సమన్వయ న్యాయం చేయడంలో ముందు ఉంటదని మాదిగ సామాజిక వర్గానికి సమన్వయ న్యాయం చేసేదే కాంగ్రెస్ పార్టీ అని అవసరం అయితే ఆర్డినేన్స్ తెస్తామని, దేశంలో మొదటగా తెలంగాణ రాష్ట్రము లో వర్గీకరణ అమలుచేసి అందరికి న్యాయం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అనడం చాలా అనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కన్వీనర్ సాంబయ్య ,జిల్లా నాయకులు భాస్కర్, గొర్రె మహేందర్ ,డాక్టర్ రమేష్, బీమా వినయ్ కుమార్, రమేష్ ,కుంజాకర్ రాకేష్ ,మేరీ సుకన్య, సుధాకర్, పూర్ణ ,స్వప్న ,రాజేష్ ,సంగీత్ ,జిల్లా, డివిజన్, మండల, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు(ఎం) మండల సిపిఐ కార్యదర్శిగా మారుపాక వెంకటేశం సహాయ కార్యదర్శిగా బత్తిని నరేష్


మారుపాక వేంకటేశం


బత్తిని నరేష్

**తరంగాలు ,ఆలేరు ఆర్సీ:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో గురువారం రోజున జరిగిన సిపిఐ ఆత్మకూరు(ఎం)మండల నిర్మాణం కౌన్సిల్ సమావేశం మారుపాక మల్లేష్ అధ్యక్షతన జరిగినది. కౌన్సిల్ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శిగా మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శిగా బత్తిని నరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన మండల కార్యవర్గ కౌన్సిల్ సభ్యులకు మరియు సిపిఐ జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ మాకు ఇచ్చిన బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం,ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని నిత్యం ప్రజల మధ్యనే ఉంటామని, ప్రభుత్వం నుండి వచ్చే ప్రతిఫలాలు అర్హులైన పేద ప్రజలకు అందేలా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.సిపిఐ పార్టీగా ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని తెలిపారు.

## వనమహోత్సవం పారిశుద్ధ్యం పైన సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీడీఓ రాములు నాయక్




**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం రోజు పరిషత్ కార్యాలయంలో వనమాహెూత్సవం, పారిశుధ్య కార్యక్రమాల పైన సమీక్షా సమావేశం నిర్వహించిన ఎంపీడీఓ రాములు నాయక్ .ఎంపీడీఓ మాట్లాడుతూ అందరు వనమాహెూత్సవం కార్యక్రమంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున్న ప్లాంటేషన్ పనులు చేయాలనీ ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రతి రోజు చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా శానిటేషన్ చేయించాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎంపీఓ జులూరు పద్మావతి, ఏపీఓ బోడిగే రమేష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు మల్లేష్, శ్రీశైలం, యాదిరెడ్డి, నిర్మల, పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలసిన సెంట్రల్ ట్రైనీ అసిస్టెంట్ స్టాటిస్టికల్, సెక్షన్ ఆఫీసర్లు




**వరంగల్ జిల్లా బ్యూరో తరంగాలు** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాదులో శిక్షణ పొందుతున్న అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ జూబ్లీహిల్స్ హైదరాబాదులో శిక్షణ పొందుతున్న 20 మంది సెంట్రల్ సెక్రటేరియట్ అసిస్టెంట్ స్టాటిస్టికల్ సెక్షన్ ఆఫీసర్లు జూలై 29 నుండి ఆగస్టు 2 వరకు జిల్లాలోని గీసుకొండ మండలంలోని గంగాదేవి పల్లి, మరియాపురం గ్రామాలను, వర్ధన్నపేట మండలం, ఇల్లందు, సంగేమ్ మండలంలోని తీగరాజు పల్లి గ్రామాలను సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వాటి అమలు తీరును అవగతం చేసుకున్నారు. సందర్శన ముగింపు సందర్భంగా వారు కలెక్టర్ ను కలసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు , గ్రామాల అభివృద్ధికి ఏవిధంగా దోహద పడతాయనే విషయాలను వివరించారు. అందించిన సూచనలు, సలహాలు భవిషత్తులో ప్రణాళికలు రూపొందించుటకు ఉపయోగ పడతాయని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి డి ఆర్ డి ఓ కౌశల్య దేవి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఇటిసి ప్రిన్సిపాల్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి సభకు ఉపాధ్యాయులను తరలిస్తున్న ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్





**వరంగల్ జిల్లా బ్యూరో తరంగాలు** రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో మధ్యహ్నం హైద్రాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు పాల్గొనుటకు గాను జిల్లాలోని ఉపాధ్యాయులను తరలిస్తున్న టిజి ఆర్టీసీ బస్సులను కలెక్టరేట్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా జండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 13 మండలాలలో విద్య, మైనారిటీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలలో పదోన్నతి పొందిన సుమారు 634 మంది ఉపాధ్యాయులు హైదరాబాద్ ఎల్ బి స్టేడియంలో జరిగే సభకు హాజరై తిరిగి సురక్షితంగా చేరుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.ప్రతి టీజీ ఆర్టీసీ బస్సులో డ్రైవర్, అటెండెంట్, ఏ ఎన్ ఎం, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి,జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

## స్పోర్ట్స్ పాలసీకి కృషి చేస్తున్న రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



**తరంగాలు ప్రతినిధి /వరంగల్** రాష్ట్రంలో అన్ని రకాల క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు సహకారం, ఉద్యోగ భద్రత కల్పించేలా దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ పాలసీ తీసుకురాబోతున్న క్రీడాకారుల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి కి టీపీసీసీ గీత సెల్ సెక్రటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ ఒక ప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించి అథ్లెటిక్స్ లో ప్రతిభ చాటిన దీప్తికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిన కోరారు. యావత్ తెలంగాణ లోని అన్ని రకాల క్రీడాకారుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెంకట రమేష్ గౌడ్ తెలిపారు.

# బీర్ల ఐలన్నని విమర్శిస్తే ఊరుకునేది లేదు

**–మిర్యాల సాయిలు**



**తరంగాలు ,ఆలేరు ,ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలన్నపై తప్పుడు మాటలు మాట్లాడిన టిఆర్ఎస్ బిజెపి నాయకులు.బీజేపీ నాయకులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారు గత టిఆర్ఎస్ పాలనలో యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు కనీస వసతులు కూడా కల్పించలేదు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బీర్ల ఐలన్న 300 ఆటో కుటుంబాలకు అండగా నిలబడ్డాడు. గత ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు తీరని అన్యాయం జరిగింది. అలాంటి ఆటో కార్మికులకు గతంలో ఏ విధంగా అయితే కొండపైకి ఆటోలు నడుపుకున్నారో అదేవిధంగా గుట్ట పైకి ఆటోలు వెళ్లడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి ఆటో కార్మికులకు న్యాయం చేసిన వ్యక్తి. కొండపైన విషయానికి వస్తే గతంలో స్వామివారిని దర్శించుకోవడానికి స్థానికులకు కూడా ఇబ్బంది ఉండేది. కొన్ని సంవత్సరాల తరబడి ఆనవాయితీగా వస్తున్న శనివారం దర్శనంతో పాటు ప్రతి మంగళవారం స్థానికులకు గర్భగుడి దర్శనం కల్పించిన నాయకుడు బీర్ల అయిలన్న.కొండపైన వచ్చే భక్తులకు బస చేసుకోవడానికి కూడా వీలు కల్పిస్తూ డార్మెటరీ హాల్ ఏర్పాటు చేయడం జరిగింది.

## ఏఐఎఫ్ కేంద్ర ప్రభుత్వం నిధుల కింద ట్రాక్టర్ అందుకున్న బోయిన స్వామి



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ గుండాల బ్రాంచ్ బ్యాంకు మేనేజర్ ఎం సుశాంత్ మాట్లాడుతూ మరిపడిగ గ్రామానికి చెందిన రైతు బోయిన స్వామికి ఏఐఎఫ్ కేంద్ర ప్రభుత్వం నిధుల కింద ట్రాక్టర్ ఇవ్వడం జరిగిందని ఇంకా అర్హులు 5 ఎకరాలు పైబడి ఉన్న రైతులు కూడా ఏపీజీవీబీ బ్యాంకు మేనేజరును సంప్రదించి అడిగి తెలుసుకోగలరనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ హేమంత్, క్యాషియర్ పృద్వి చరణ్, బ్యాంకు సిబ్బంది నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు బీమా కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**-వ్యవసాయ విస్తరణ అధికారి మహేష్ నాయక్**



**తరంగాలు/అడవిదేవులపల్లి:** రైతులు రైతు బీమా కొరకు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి కే మహేష్ నాయక్ కోరారు. శుక్రవారం అడవిదేవులపల్లి రైతు వేదిక వద్ద మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతుల నుంచి వ్యవసాయ విస్తరణ అధికారి మహేష్ నాయక్ రైతు బీమా దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 28, 2024 వరకు పట్టా రిజిస్ట్రేషన్ అయిన 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల వారు, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని, అర్హులైన రైతులు స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు పట్ట పాస్ బుక్, రైతు ఆధార్ కార్డు,నామిని ఆధార్ కార్డు జీరాక్స్ లు,రైతు బీమా దరఖాస్తు పత్రం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే రైతులు తీసుకోవాలని కోరారు. రైతు బీమా దరఖాస్తులకు ఈనెల 5వ తేదీ చివరిది కావున అర్హులైన ప్రతి ఒక్క రైతు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు మహేష్ నాయక్ ,రావుల నరేష్,గ్రామ రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణంరాజు కు సన్మానం

**-కలామ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత**



**తరంగాలు/చెన్నారావుపేట:** చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న కార్యదర్శి కృష్ణంరాజు కలామ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో ఉన్నటువంటి సమస్యల గురించి కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎండి బాష్మియా మాట్లాడుతూ ప్రధానంగా వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు(జ్వరం డెంగ్యూ, మలేరియా) వచ్చే ప్రమాదం ఉంది కాబట్టి గ్రామంలో వాడవాడకు దోమల మందు పిచికారి చేయాలని,వాడ వాడకు బీజింగ్ పౌడర్ చల్లించాలని,పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు ఎండి బాష్మియా, కార్యదర్శి పరికి మధుకర్, ఉపాధ్యక్షులు పోగుల అశోక్, కోశాధికారి హనుమండ్ల రాజేందర్, కమిటీ సభ్యులుసమ్మెట కృష్ణ, గుల్లపల్లి మధు, ఉడుగుల దీక్షిత్, సారంగం, ఎండి ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# 1.23 ఎకరాల ఆర్మీ శిక్షణా కేంద్ర స్థలం అప్పగింతకు కృషి చేయాలి

**-ఆర్మీ అధికారులు జిల్లా కలెక్టర్ తో సమీక్ష**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** ఆర్మీ శిక్షణా కేంద్రం ఏర్పాటుకు రఘునాధపాలెం లో కేటాయించిన స్థలం విషయమై ఆర్మీ అధికారులు శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ని కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో కలిశారు.ఈ సందర్భంగా రఘునాధపాలెం లో ఆర్మీ శిక్షణా కేంద్రానికి కేటాయించిన 1.23 ఎకరాల స్థలాన్ని అప్పగించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం వెళ్లే దారిలో గల ఎన్సిసి బెటాలియన్ కార్యాలయాన్ని పాత సబ్ జైలుకు మార్చుటకు చర్యలకు కలెక్టర్ ని ఎన్సిసి కమాండెంట్ కోరగా, జైళ్ల శాఖ డిజిని సంప్రదించి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆర్మీ అధికారులు కల్నల్ ఎస్కె. భద్ర, కమాండింగ్ అధికారి 11 (టి) ఎన్సిసి బెటాలియన్, సీఆర్పీఎఫ్ కమాండెంట్ రితీశ్ ఠాకూర్, సీఆర్పీఎఫ్ స్టాఫ్ ఆఫీసర్స్ & లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ 11(టి) ఎన్సిసి బెటాలియన్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి






**-వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**

**వరంగల్ జిల్లా బ్యూరో తరంగాలు** జిల్లాలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ అధికారి అనుజ్ అగర్వాల్, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో చేపట్టాల్సిన వివిధ అంశాలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు రోజులపాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో రోజువారీగా చేపట్టాల్సిన పనులపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమ నిర్వహణ పటిష్టంగా జరుగుటకు మండల స్థాయిలో జిల్లా పరిషత్ సీఈఓ, డిఆర్డీఓ, పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని అన్నారు.స్థానిక ప్రజా ప్రతి నిధులు, స్వయం సహాయక సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్లలో పారిశుధ్య పనులతోపాటు, ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటిస్తూ మురుగు కాలువలను శుభ్రం చేయించాలన్నారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమల వృద్ధిని అరికట్టాలన్నారు.తాగు నీటి వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మంచినీటి ట్యా0కు శుభ్రత, మంచినీటి సరఫరా, నిర్ణీత మోతాదులో క్లోరికేషన్ చేసేలా చూడాలని, 300 చదనపు గజాల ప్లాట్ ఉన్న భవనాలు వర్షపు నీటి నిలువ ఏర్పాట్లను చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, గ్రామాలలో ఫివర్ సర్వే నిర్వహణ, దోమల నివారణకు అయిల్ బాల్స్ ను తయారు చేయించి చేసి మురుకి నీటి నిలువలలో వొదిలే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం'పై విద్యార్థులకు వ్యాసరచన, పద్య గేయాల పోటీలు నిర్వహించి బహుమతులను అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ డీఈవోకు సూచించారు.వన మహోత్సవం కింద గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, పట్టణాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ నిమిత్తం అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటేందుకు ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కుక్కల బెడద ఉన్న ప్రాంతాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.జిల్లా అటవీ అధికారి అనుజ్ అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాట్టిన ప్రతి మొక్క పేరు పై కార్డ్ ఏర్పాటు చేసి పేరు వచ్చేలా మొబైల్ సెల్ఫీ తీసి వెబ్ సైట్ meri life.nic.in లో అప్లోడ్ చేసిన అత్యుత్తమ ఫొటోకు బహుమతులు అందిస్తామని అన్నారు. జిల్లా లో పచ్చదనం పెంపొందించుటకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు చేస్తూ జిల్లా లక్ష్యాన్ని సాధించుటకు అధికారులు కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జెడ్పీసీఈఓ రామిరెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష


**-ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా**
**-పిల్లలకు తల్లిపాలు తాగించండి పిల్లల భవిష్యత్తును కాపాడండి.**
**-పిల్లలలో రోగ నిరోధక శక్తి పెంచడంలో తల్లిపాలు కీలకం.**



**తరంగాలు /చెన్నారావుపేట :** తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని చెన్నారావుపేట ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా అన్నారు.శుక్రవారం చెన్నారావుపేట మండల పరిధిలోని కోనాపురం, ఉప్పరపల్లి గ్రామాలలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని స్థానిక అంగన్వాడి సెంటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నారావుపేట ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధా హాజరై మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు తాగించడం వల్ల వారు ఆరోగ్యంగానూ మరియు వారిలో రోగ నిద్దారక శక్తి ఎక్కువగా ఉంటుందని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని, దాని ద్వారా పిల్లల్లో మానసిక వికాసాన్ని పెంపొందించడం కోసం అంగన్వాడి కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు బాలింతలకు పోషకాహారం అందించడంలో ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని అన్నారు. అనంతరం పిల్లలు, బాలింతలతో కలిసి అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే ఆహార పదార్థాలు, పిల్లలకు బోధించే విధానాలు పుస్తకాల ఎగ్జిబిషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి.విజయలక్ష్మి, యు. రజిత, కే.సరోజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, టీచర్, కలామ్స్ ఫౌండేషన్ కార్యదర్శి పరికి మధుకర్, సమ్మడి కృష్ణ, అనుమాండ్ల రాజేందర్, మరియు అంగనవాడి ఆయాలు,పిల్లలు, బాలింత కోనాపురం అంగన్వాడి టీచర్ జన్ను శిరీష, రమాదేవి ,తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయండి


**-పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్**



**తరంగాలు/పాలేరు ఆర్సి:** స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని కోరారు .గ్రామాలలో ఎటువంటి గ్రూపులకు తావు లేకుండా , కొత్త పాత అనే తారతమ్యం లేకుండా అందరూ కలసి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజారిటీ అందించాలని కోరారు.

# ఒలంపిక్స్ లో భారత్ కు మూడో పతాకం రావడం గర్వకారణం

**-కూసుమంచి మండల కాంగ్రెస్ మాజీ సర్పంచ్ గుండా దామోదర్ రెడ్డి**



**తరంగాలు / పాలేరు ఆర్సి:** ఒలంపిక్స్ లో భారత్ కు మూడు పతాకాలు రావడం గర్వకారణం అని కూసుమంచి మండల కాంగ్రెస్ మాజీ సర్పంచ్ గుండా దామోదర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 మీటర్ రైఫిల్ త్రీ పొజిషన్స్ షూటింగ్ విభాగంలో కాంస్య పతాకం సాధించిన స్వప్నిల్ కుసాలె నో గుండా దామోదర్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. దీంతో భారత్ మూడో పతాకం కైవసం చేసుకుందన్నారు. భారతదేశంలో అథ్లెట్లు మరెన్నో పతాకాలు సాధించాలని కోరారు. మువ్వన్నెల జెండా రెపరెప లాడించాలని దేశ ఖ్యాతిని మరింత పెంచాలని అన్నారు.

# అరోపణలు ఎదురుకుంటున్న బీర్ల అయిలయ్య నిరూపించుకోవాలి

**-బీఆర్ఎస్ పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి**



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో వారు అరోపణలు ఎదురుకుంటున్న బీర్ల అయిలయ్య నిరూపించుకోవాలి అని కొండపైన దుకాణల అనుమతి, దేవస్థాన ఉద్యోగుల బదిలీ అడ్డుకునేందుకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య డబ్బులు వసూలుకు పాల్పడినట్లు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారని, అవాస్తవమని ఎమ్మెల్యే స్వామి వారి పాదాల వద్దకు వచ్చి ప్రమాణం చేసి నిరూపించుకోవాలని బీఆర్ఎస్ పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పై అరోపణలు చెస్తే కాంగ్రెస్ పట్టణ నాయకులు ఉలికి పడుతున్నారని అన్నారు. కొండపైన దుకాణాలు, అధికారులు బదిలీపై ఎంత డబ్బులు తీసుకున్నావో చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రజలు కోడై కూస్తున్నారని తెలిపారు. 50 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కనాడు గుట్ట అభివృద్ధిపై ఆలోచించలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి రాగానే 1200 కోట్లతో ఆలయాన్ని మహాద్భుతంగా పునర్మించారన్నారు. ఆయన ఆనవాలు లేకుండా చేయాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నం ఫలించదన్నారు. యాదగిరిగుట్ట ఉన్నంతకాలం కెసిఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. యాదగిరిగుట్ట కొండపై ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉందని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. పట్టణంలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని భయపడ్డ పట్టణ కాంగ్రెస్ నాయకులు ప్రమాణాలకు తెరతీసారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టణ ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమైనట్టు తెలిపారు. అసెంబ్లీలో దేవస్థాన ఉద్యోగులకు మద్దతుగా మాట్లాడిన మాటలకు పట్టణంలో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత వచ్చిందన్న భయంతో కాంగ్రెస్ నాయకులు ప్రమాణాల డ్రామా ఆడుతున్నారన్నారు. ఎన్ని డ్రామాలు, ఎన్ని ప్రమాణాలు చేసినా పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని , ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్యను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం చంద్రం , సయ్యద్ బాబా , షేక్ దావూద్ , గడ్డమిది రాజాలు , దండబోయిన వీరేష్ , క్రాంతి ,ఎండీ యాకుబ్ , భక్త కన్నప్ప , తోటకూరి మల్లేష్ , చిరంజీవి మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## కనిపించట్లేదు



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో**

ఖమ్మం జిల్లా ,నేలకొండపల్లి : కుటుంబ కలహాలతో ఇల్లు వదిలిపెట్టి ఇద్దరు చిన్నపిల్లలతో సహా యువతి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామం చోటు చేసుకుంది. చెన్నారం గ్రామానికి చెందిన కర్లపూడి మేఘన వయసు 25 సంవత్సరాలు బాబు వయసు 3 సంవత్సరాలు పాప వయసు 1 సంవత్సరం, కుటుంబ కలహాలతో ఇంట్లో చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయిన మహిళ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు.ఈ విషయంపై నేలకొండపల్లి పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కూడా నమోదయి ఉన్నది.ఎవరికైనా వివరాలు తెలిస్తే ఈ నెంబర్కు తెలియజేయగలరనీ కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు.

కర్లపూడి వెంకట్రావు 86399 59755,9494420104.

## 125 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత



**తరంగాలు ప్రతినిధి/ జఫర్గడ్:**

125 క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని, ఒక వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు జఫర్గడ్ ఎస్ఐ బానోతు రాంచరణ్ తెలిపారు.మండల కేంద్రంలోని సురారం గ్రామంలో ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం అక్రమంగా డంప్ చేసి ఎక్కువ ధర కు విక్రయిస్తున్నారని విశ్వనీయ సమాచారంతో జఫర్గడ్ ఎస్సై బానోతు రాంచరణ్ టాస్క్ ఫోర్స్ అధికారులతో కలిసి సురరం గ్రామ శివారులోని వంగ యకయ్య రైస్ మిల్లులో తనిఖీ చేశారు . ఈ తనిఖీలో 125 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి, రేషన్ బియ్యాన్ని అక్రమంగా డంప్ చేసిన జఫ్ఫార్గఢ్ మండల కేంద్రానికి చెందిన దొడ్డ రమేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆలగడప లో రోడ్డు ప్రమాదం ఒకరు మృతి

**-ఎస్సై నరేష్ మిర్యాలగూడ**



**తరంగాలు మిర్యాలగూడ ప్రతినిధి**

మిర్యాలగూడ రూరల్ ఆలగడప గ్రామస్తుడగు ఇంద్రపల్లి సైదులు తండ్రి తండ్రి నరసయ్య 42 సంవత్సరాలు శుక్రవారం ఆలగడప గ్రామంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్నటువంటి ఇంటికి వచ్చు క్రమంలో జాతీయ రహదారి కోదాడ జడ్చర్ల ఎన్ హెచ్ 167 రోడ్డుపై దాటుతుండగా ఏపీ 40 సిడి 4456 నెంబర్ గల మారుతి సుజుకి కార్ ఢీకొన్నది తలకు తీవ్రమైన గాయం కావడంతో ముందు మిర్యాలగూడలోని అపోలో రీచ్ హాస్పిటల్కు తీసుకు వెళ్ళగా మెరుగైన వైద్యం కొరకు నల్లగొండ హాస్పిటల్ కు రిఫర్ చేశారు అక్కడికి తీసుకెళ్లిన తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడి సొంత అన్న సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కార్ డ్రైవర్ వీరాంజనేయులు పై కేసు ఫైల్ చేసి దర్యాప్తు చేస్తున్నాము శవాన్ని పోస్టుమార్టం అనంతరం వాళ్లు సోదరుడికి అప్పగించడం జరిగింది మృతుడు అవివాహితుడు. ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

# డగ్స్ మహమ్మారినీ తరిమి కొడదాం యువత భవిష్యత్తుని కాపాడుదాం







**-యూత్ కాంగ్రెసు నాయకుల ఆధ్వర్యంలో**
**-ముఖ్య అతిథిగా ఎస్సై వెంకట శ్రీనివాస్**

**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాశాలలో యూత్ కాంగ్రెస్ నాయకులు డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడదాం యువత భవిష్యత్ ని కాపుడుదాం అనే సంకల్పంతో కార్యక్రమం చెప్పట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆలేరు ఎస్సై వెంకట శ్రీనివాస్ రావడం జరిగింది. అయన మాట్లాడుతూ డ్రగ్స్ మాయలో పడి యువత భవిష్యత్ ని కోల్పోతున్నారు. తల్లి తండ్రులకి దూరం అవుతున్నారు. చదువు కోల్పోతున్నారు. డ్రగ్స్ మత్తులో నేరాలకి పాల్పడిన జీవితం పాడు చేసుకుంటున్నారు. అందుకే డ్రగ్స్ అనే మహమ్మారిని తరిమి కొట్టి మీ యొక్క ఉజ్వల భవిష్యత్ ని పదిమందికి ఉపయోగ పడేలా తీర్చిదిద్దు కోవాలని మంచి బాటలో నడిచి పదిమందికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట్ల లోకేష్ , కాసుల భాస్కర్, ఆలేరు టౌన్ 6వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు పర్శ నరేష్,ఎస్సీ సెల్ అధ్యక్షులు సంగి రంజిత్, ఎన్ఏస్యూఐ టౌన్ నాయకులు ఊత పవన్ చరణ్, నవీన్, బాబు, దీక్షిత్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన హన్మకొండ జిల్లా అధ్యక్షులుగా సిద్దు నాయక్



**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి**

సేవాలాల్ సేన హన్మకొండ జిల్లా అధ్యక్షులుగా భూక్య సిద్దు నాయక్ ని నియమంచడం జరిగింది. నర్సంపేటలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ్ నాయక్ హన్మకొండ అధ్యక్షునిగా సిద్దు నాయక్ ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ్ నాయక్ మాట్లాడుతూ దశాబ్దం పాటుగా గిరిజనుల కోసం అనేక ఉద్యమాలు చేస్తూ రాష్ట్రంలో గిరిజనులలో ఐక్యతను పెంచిన ఏకైక సంఘం సేవాలాల్ సేన అని పేర్కొన్నారు. నియామక పత్రం అందుకున్న బాద్యులందరు క్రమశిక్షణతో పని చేయాలని అన్నారు. అధ్యక్ష నియామక పత్రం అందుకున్న సిద్దు నాయక్ తన నియామకానికి సహకరించిన సంజీవ్ నాయక్,సైదా నాయక్,ఉషన్ నాయక్ లకు ధన్యవాదాలు తెలిపారు. తన మీద నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని పేర్కొన్నారు

# ఎస్సీ వర్గీకరణ అంశంలో తెలంగాణ ముఖ్యమంత్రి తొందరపాటు తగదు.

**-జాతీయ మాల ఐక్యవేదిక చైర్మన్ చెన్నయ్య**



**తరంగాలు హైదరాబాద్ సిటీ**

సుప్రీం కోర్టు తీర్పు తో ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లకు భంగంలిమాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్యసుప్రీం కోర్టు ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్లపై నిన్న ఇచ్చిన తీర్పు ఎస్సీ ఎస్టీ ల రిజర్వేషన్లకు బంగం కలిగించేల ఆర్టికల్ 341 కి విరుద్ధం గా రాజకీయ ప్రమేయం ఉండేలా ఉందని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ G చెన్నయ్య పేర్కొన్నారు ఈ రోజు NSS ప్రెస్ క్లబ్ లోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక వివక్ష కారణంగా ఏర్పరిచిన రిజర్వేషన్లను ఆర్థిక ప్రాతిపదికన ఎలా విడగొడతారని బిజెపి ప్రభుత్వం దేశం లోని దళిత ఆదివాసీ సమాజాన్ని అస్థిరపరిచే చర్యలకు పూనుకున్నదని దీనిని దళిత ఆదివాసీ సమాజం తో పాటు ప్రజాస్వామిక వాదులు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ నెల 8 9 10 తేదీ లలో డిల్లీలో నిరసన చేపడతామని అనంతరం మాల మహానాడు ఆధ్వర్యంలో దేశం లోని వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలను, వివిధ సంఘాలను ఏకీకృతం చేసి పోరాడుతామని అన్నారురిజర్వేషన్ల లో వర్గీకరణ మళ్ళీ సూక్ష్మ వర్గీకరణ కు దారితీస్తుందని తద్వారా రిజర్వేషన్లకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని చెన్నయ్య పేర్కొన్నారు మందకృష్ణ మాదిగ కోర్టు తీర్పు వెలువడగానే కోర్టుకు ధన్యవాదాలు తెలుపకుండా ప్రధాని మోడీ,హొం మంత్రి అమిత్ షా లకు కృతజ్ఞతలు తెలుపటం తోనే తీర్పు పై వారి ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చని చెన్నయ్య పేర్కొన్నార రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనాభా లెక్కలు లేకుండా, ఏకనామికల్ స్టేటస్ తెలుసుకోకుండానే రాత్రికి రాత్రే వర్గీకరణ చేస్తామన్నట్టుగా మాట్లాడుతున్నారని మాల కులాల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు విద్యార్థులు మేధావులతో చర్చించి కార్యాచరణను ప్రకటిస్తామని చెన్నయ్య పేర్కొన్నారు ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నే శ్రీధర్ రావు, మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ గోపోజు రమేష్ ,మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాలూక రాజేష్, మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ గోకుల్ కళ్యాణ్, మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ మరిపల్లి శ్రీకాంత్, మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ కమల్,మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి జంగం గణేష్,మాల మహానాడు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదర్శ్,అనిల్ కుమార్, మన్నె రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**-జిల్లా విద్యుత్ అధికారి ఇదుకుడి శ్రీనాథ్**



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని కొలనుపాక రోడ్డులో గల ఒకటవ వార్డు బస్ స్టాప్ వద్ద యాదాద్రి భువనగిరి జిల్లా విద్యుత్ అధికారి ఇదుకుడి శ్రీనాథ్ ఆధ్వర్యంలో సిఎండి ముషారఫ్ అలీ ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారుల సమస్యలను విని వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని చెప్పడం జరిగినది. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనాథ్ మాట్లాడుతూ నేరుగా విద్యుత్ వినియోగదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపినారు. నాణ్యమైన విద్యుత్ తో పాటు వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరిగినది. అలాగే తుప్పు పట్టి శిథిలావస్థలో ఉన్న ఇనుప స్తంభాలను సందర్శించి వెంటనే మార్చాలని వాటి స్థానంలో కొత్త స్తంభాలను వేయాలని ఆలేరు ఏఈకి చెప్పడం జరిగినది. ఆలేరు పట్టణ మరియు ఒకటవ వార్డులోని సమస్యలను అడిగిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందుకు ఎస్ఈ శ్రీనాథ్ కి మరియు డిఈ, ఏఈ, సబ్ ఇంజనీర్, ఆలేరు పట్టణ ఎలక్ట్రిసిటీ లైన్మెన్ లకు మరియు సిబ్బందికి ఆలేరు ఒకటో వార్డు కౌన్సిలర్ చింతలఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలేరు పట్టణ ఏడీఈ గుగులోతు సూర్యా నాయక్, ఏఈ మిట్ట వెంకటేష్, సబ్ ఇంజనీర్, ఆలేరు పట్టణ లైన్మెన్లు మరియు వార్డు ప్రముఖులు పాల్గొనడం జరిగినది.

## సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపిన టీజేయూ జిల్లా అధ్యక్షుడు షానూర్



**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండల కేంద్రంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ధర్మాసనం అనుకూలంగా తీర్పు ఇచ్చిన శుభ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు . 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకంగా ఉందని అన్నారు .

## దళిత బంధు లబ్దిదారులకు పూర్తి పథకం అందించాలి

**-జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
దళితబంధు లబ్దిదారులకు పథక పూర్తి లబ్దిని అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో దళితబంధు చింతకాని మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించి,పథక అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,చింతకాని మండలంలో దళిత బంధు పథక అర్హులైన లబ్ధిదారులందరికి పథక లబ్ది చేకూరేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. మండలంలో 25 గ్రామాల నుండి 3462 మంది అర్హులైన లబ్ధిదారులను గుర్తించి దళితబంధు పథకం క్రింద వివిధ రకాల యూనిట్లను మంజూరు చేసి,గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. యూనిట్ల విలువను బట్టి, దళితబంధు పథక అర్హత మంజూరు మొత్తం నుండి నిధులను లబ్దిదారులకు అందజేయడం జరిగిందన్నారు. 1888 మంది లబ్దిదారులకు పూర్తి మొత్తం అందజేయగా, మిగతా వారికి వారి వారి ఎంపిక ప్రకారం మొత్తాన్ని అందజేశామన్నారు.యూనిట్, యూనిట్ ధర,ఇంకనూ దళితబంధు అర్హతలో చెల్లించాల్సిన మొత్తం,గ్రామాల వారీగా,లబ్ధిదారుల వారీగా నివేదిక సమర్పించాలన్నారు. లబ్దిదారులకు మంజూరు యూనిట్, ప్రస్తుతం దాని పరిస్థితి, లబ్దిదారుడు అట్టి యూనిట్ తో ఉపాధి పొందుతున్నది,ఇప్పటి వరకు మంజూరు పోనూ,మిగిలిన సొమ్ముతో ఏమి చేయదల్చుకున్నది, యూనిట్ సంబంధ ఉపకరణాలు లేదా మరో యూనిట్ మంజూరు విషయమై లబ్దిదారునితో చర్చించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, లబ్దిదారునికి ఆర్థికాభివృద్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, డిఆర్డీవో సన్యాసయ్య, జెడ్పి సిఇఓ ఎస్. వినోద్, ఎస్సి కార్పొరేషన్ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ అధికారి నవీన్ బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు/చింతకాని మండల దళితబంధు పథక గ్రామ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైరా ఆయకట్టు రైతులతో సమీక్ష సమావేశం

**-వైరా మండల కాంగ్రెస్ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
వైరా రిజర్వాయర్ ప్రాజెక్ట్ ఆయకట్టు క్రింద అఖిల పక్ష రైతులతో వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో వైరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది.ఈ సమావేశంలో వైరా ప్రాజెక్ట్ ఆయకట్టు క్రింద యున్న రైతులు వారి అభిప్రాయం మేరకు తక్షణమే ఖరీఫ్ సీజన్లో భాగంగా వారి నార్లు పోసుకొవటానికి వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ ని ఫోన్ ద్వారా సంప్రదించగా ఇరిగేషన్ అధికారులను రైతుల అభిష్టం మేరకు వైరా ప్రాజెక్టు ఆయకట్టు క్రింద రైతులు వరి నార్లు పోసుకొవటానికి ఈ నెలలో ఆగస్టు 6వ తారీకు శనివారం సాయంత్రం కుడి, ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వైరా సహకార సంఘం అధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, అఖిల పక్ష పార్టీ నాయకులు కట్ల రంగారావు, దాసరి దానియేలు , చెరుకూరి చలపతిరావు,కిలారు సురేందర్, పారుపల్లి కృష్ణారావు, అర్జున్ రావు, మట్టూరి వెంకటేశ్వరరావు, మచ్చా బుజ్జి,పాలేటి నరసింహారావు, బొళ్ళ గంగారావు, తాంపూడి రోశయ్య, చింత నిప్పు మురళి, చింత నిప్పు మాదవరావు , పొట్లపల్లి శ్రీ ను, షేక్ సైదా,మేడూరి రామారావు, తాతా రంగారావు, గొల్లపూడి కృష్ణారావు,అనుమోలు స్వామి, శీలం చంద్రశేఖర్ రెడ్డి,నూతి వెంకటేశ్వరరావు, మల్లు రామకృష్ణ, షేక్ రహీం, నర్వనేని అశోక్, చింత నిప్పు శ్రీను , గొల్లపూడి హరినాథ్ బాబు షేక్ ఎర్ర మొగలాలి, ఆలపర్తి హరినాథ్,చప్పిడి వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు,కొరే వెంకటేశ్వరరావు,అయిలూరి కోటిరెడ్డి, మోత్కూరి వెంకటేశ్వరరావు, పూర్ణ, షేక్ పఠాన్,గాలి శ్రీనువాసురావు,సత్తెనపల్లి నరసింహారావు, తడికమళ్ళ ఏసోబు తదితరులు పాల్గొన్ని, రైతులు హర్షం వ్యక్తం పరిచి వైరా శాసన సభ్యులు మాలోతు రాందాస్ నాయక్ కి అన్నదాతలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## తస్మాత్తు జాగ్రత్త

**-ఎస్సై కృష్ణయ్య**




**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి డ్రగ్స్ మరియు సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని మెయిన్ రోడ్డు పై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూ ప్రజలు తమ పరిసర ప్రాంతాలలో ఎవరు అయినా అనుమానస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని, డ్రగ్స్(మత్తు పదార్దాలు) మరియు సైబర్ మోసాల పట్ల (ఓటీపీ, ఆన్లైన్ లింక్ సంబంధ) అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాల పై టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయాలని, ఇళ్లు వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి అని ప్రజలకు సూచించిన స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ కృష్ణయ్య.

## సీపీఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన ఉండాలి






**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**
సీపీఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ డైరెక్టర్ ఎస్.కె హమీద్ పాష తెలిపారు.శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిల్లో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ కుమార్,కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్,మెడికల్ ఆఫీసర్ స్వర్ణలత,ఏఎన్ఎం శ్రీలక్ష్మి, లెక్షరర్లు స్వప్న, విజయ్, మురళీ, సురేష్,సైదాస్, గోపి,మృదుల, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి

**తరంగాలు/హన్మకొండ ప్రతినిధి**
హన్మకొండ,ఖిలా వరంగల్, ఆత్మకూర్,దామెర మండలాల తహసీల్దార్ ఆఫీస్ ల ముందు సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ ( ప్రజా పంథా) ధర్నా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఆరు గ్యారెంటీలతో పాటు ఇంకా అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు పూర్తయిందని, ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి ఆ గ్రహం వ్యక్తం చేశారు.శుక్రవారం సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ వరంగల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ,ఖిలా వరంగల్, ఆత్మకూర్,దామెర మండల తాహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించటం జరిగింది.అనంతరం ఖిలా వరంగల్ తాహశీల్దార్ బండి నాగేశ్వర్ రావు, హన్మకొండ డిప్యూటీ తహసిల్దార్ ఎం.రంజిత్ కుమార్,ఆత్మకూరు తహసిల్దార్ నాయిని జగన్మోహన్ రెడ్డి,దామెర తాహసిల్దార్ మంద విజయలక్ష్మి లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించడం జరిగింది.ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ,ఇండ్లు, ఇళ్ల స్థలాలు తదితర అనేక సమస్యల పరిష్కారం కోసం పేద ప్రజలు 10సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్నారని, తాము వృద్ధులు అవుతున్న తమ పిల్లలు పెరిగి పెద్దవాళ్లు




అయి, పెళ్లయి వేరుపడి, ఇరుకు గదుల్లో దీనంగా బతుకుతున్న పేదజీవులు వీటికోసం ఎదురు చూస్తున్నారని,కెసిఆర్ ఊరించి,ఉబ్బించిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఏ ఒక్కరికి రాలేదని , కొత్త రేషన్ కార్డులు,కొత్త పెన్షన్ లేక సంవత్సరాల కాలమైందని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని,అధికారం వచ్చిన తర్వాత పథకాల అమలు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నదని, తక్షణమే కొత్త రేషన్ కార్డులు,ఇండ్లు,ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.రైతాంగ రుణాలను మొత్తం రద్దుచేసి,కొత్త రుణాలు ఇవ్వాలని,పంటల భీమా పథకం జూలై,ఆగస్టు నెలలో అమలు చేయాలని,రైతు భరోసా పది ఎకరాల వరకు అందించాలని,కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని,ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని, నిరుద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం ప్రకటించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని,పోడు భూమి సాగుదారులందరికీ పట్టాలు ఇచ్చి సాగు హక్కుల్ని కల్పించాలని, ఆరోగ్యశ్రీ బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని, విద్యార్థులు ఉపకార వేతనాలు చెల్లించాలని, వ్యవసాయ కార్మికులకు ప్రకటించిన 12000 రూపాయలు జీవన భృతిని వెంటనే అమలు చేయాలని, గృహ నిర్మాణం కోసం పది లక్షల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి అర్షం అశోక్,పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, మాస్ లైన్ డివిజన్ నాయకులు మైదం పాణి, సాబిరీకానీ మోహన్,ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు బొల్లం రమేష్,సింగం కిషోర్,అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏ.ఐ.పీ.కే.ఎస్) వరంగల్ డివిజన్ అధ్యక్షులు అర్షం సుధాకర్,మోహన్ మురళి,నరేష్,బోళ్ల నాగరాజు, రామస్వామి,పసుల దామోదర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం







**-పుట్టిన గంటలోపు శిశువుకు ముర్రుపాలు పట్టించాలి**
**-శిశువుల్లో రోగనిరోధక శక్తిని పెంచే గుణం ముర్రుపాలకే ఉంది**
**-పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలి**
**-గర్భిణీలు,బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించిన**
**- వర్ధన్నపేట సీడీపీవో డేబోరా**

**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:**
పుట్టిన శిశువుకు తల్లిపాలే సంపూర్ణ ఆరోగ్యమని వర్ధన్నపేట సిడిపిఓ డేబోరా అన్నారు.శుక్రవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వ ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించిన తల్లులకు ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట సిడిపిఓ డెబోరా హాజరై మాట్లాడుతూ.. మహిళ ప్రసవించాక గంటలోపు వచ్చే పాలనే ముర్రుపాలు అని అంటారు. అయితే బిడ్డ పుట్టిన నాలుగు, ఐదు రోజుల వరకు పాలు రావని కొందరు తల్లులు అపోహ పడి ముర్రుపాలు శిశువుకు పట్టడం లేదని అన్నారు.పుట్టిన గంటలోపు ప్రతీ శిశువుకు ముర్రుపాలు పట్టించాలని,శిశువుల్లో రోగనిరోధక శక్తిని పెంచే గుణం ముర్రుపాలకు అధికంగా ఉందన్నారు. అందుకే బిడ్డకు ముర్రుపాలు పట్టడంతో పాటు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ లలిత మాట్లాడుతూ.... ప్రసవించిన గంటలోపు శిశువుకి ఇచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమని అన్నారు. ఆలాంటి ముర్రుపాలను మీ బిడ్డకు తాగించే బాధ్యత ప్రతీ తల్లిపై ఉందన్నారు.ప్రసవించిన తర్వాత తల్లి స్పృహలో ఉంటుందో ఉండదో తెలియదు కావున ప్రసవించిన తర్వాత కొడుకు పుట్టినా, బిడ్డ పుట్టినా గంటలోపు వచ్చే ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించాలని ముందుగానే మీ ఇంట్లో వారికి చెప్పి పెట్టాలన్నారు.ఈ విషయం తప్పనిసరిగా ప్రతి ఒక్క గర్భిణి స్త్రీ గుర్తుపెట్టుకోవాలన్నారు. డబ్బా పాలు ,పోత పాలు పట్టించడం వలన శిశువు ఎదుగుదల లోపంతో పాటు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. తల్లీబిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంత అవసరమో వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఏ లలిత, చంద్రకళ, విజయలక్ష్మి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ అనిత, హెల్త్ సూపర్వైజర్ ,హెచ్ సి ఓ , ఏఎన్ఎంలు ,ఆశా వర్కర్లు, సఖి స్టాఫ్ ,డి హెచ్ ఈ డబ్ల్యూ స్టాఫ్, గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాలు




**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :**
ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనదని, తద్వారా ఎస్సీలోని 59 కులాలకు దామాషా ప్రకారం సమన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్,మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం ఖమ్మం నగరం పాండురంగాపురంలోని అంబేద్కర్ సెంటర్ లో సంతోషంగా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, బాణాసంచా కాల్చి,స్వీట్లు పంచిపెట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అవిశ్రాంతంగా గత 30 సంవత్సరాలుగా ఆలు పెరగని ఉద్యమ పోరాటాలు, ఆమరణ నిరాహార దీక్షలు, మండుటెండలో పాదయాత్రలు, ధర్నాలు, రాస్తారోకోలు, అనేక నిర్బంధాలు, బలిదానాలు, వేలాదిమంది జైలు జీవితాల నడుమ సాగిన ఉద్యమంలో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు న్యాయబద్ధమైనదని, ఇది చరిత్రలో నిలిచి పోతుందని కొనియాడారు. ఈ తీర్పును అన్ని కులాల వారు సాదరంగా స్వాగతించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హెచ్. వెంకటేశ్వర్లు, బొమ్మెర ముత్యం, వేంపల్లి భద్రయ్య, ఉద్యోగ సంఘ నాయకులు పేరవల్లి మోహన్ మురళి, బండ్ల నాగేశ్వరరావు, వేంపల్లి విష్ణు, డాక్టర్ సురేందర్ పెనుమూరి, యువ నాయకులు పెసరమల్లి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన

**-బిఆర్ఎస్ నాయకులు**



**తరంగాలు ప్రతినిధి/రాయపర్తి:**
రాయపర్తి మండలం గట్టికల్ గ్రామంలో బిఆర్ఎస్ మండల పార్టీ బిసి సెల్ అధ్యక్షులు చెవ్వ కాశినాథం బావ నర్సిహుముల సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ చిన్నల లక్ష్మి నారాయణ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ నయీమ్, మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు ఆశ్రఫ్ పాషా, మండల పార్టీ నాయకులు చందు రామ్, చిన్నల రఘు, దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై పోరాటం చేయాలి



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం**
తెలంగాణఉద్యమకారుల సమస్యల పైన నిరంతరం పోరాటం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు వలిగొండ పట్టణానికి చెందిన గంధమల్ల బాలయ్యను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారగొని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు మంటి లింగయ్య, నాయకులు మంటి రమేష్,ఎక్కలదేవి శ్రీనివాస్,గంగదారి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాతకు ఆత్మీయ సన్మానం






**-పాఠశాల అభివృద్ధికి ఎన్ఆర్ఐ ముచ్చ శ్యాం సుందర్ రెడ్డి చేయుత**
**-పాఠశాలను సందర్శించి,పాఠశాల పురోగతి పట్ల సంతోషం వ్యక్తం చేసిన శ్యాం సుందర్ రెడ్డి**

**తరంగాలు ప్రతినిధి/జఫర్గడ్ :**
విద్యాబుద్ధులు నేర్పి తన ఎదుగుదలకు కారణమైన బడి అభివృద్ధికి ఎన్ఆర్ఐ ముచ్చ శ్యాం సుందర్ రెడ్డి చేయుతనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొనియాడారు. శుక్రవారం జఫర్గడ్ మండలం కునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, పాఠశాల దాత ముచ్చ శ్యాంసుందర్ రెడ్డి పాఠశాలను సందర్శించి, పాఠశాల పురోగతి పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుంది అన్నారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ కూనూరు ఉన్నత పాఠశాలకి ఇప్పటివరకు సుమారు ఎనిమిది లక్షల వ్యయంతో పాఠశాల పూర్తి భవనానికి నూతన రంగులు, నూతన గేటు నిర్మాణం, స్కావెంజర్ నియామకం, కంప్యూటర్ ల్యాబ్ అభివృద్ధి, గణిత మరియు సైన్స్ మెటీరియల్ వితరణ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన శ్యాంసుందర్ రెడ్డి పాఠశాలను సందర్శించడంతో సంతోషం వ్యక్తం చేశారు. పుట్టిన ఊరు, కన్నవారిని పట్టించుకోని ఈ రోజుల్లో తను చదువుకున్న పాఠశాల కోసం లక్షల రూపాయలు వెచ్చించి పాఠశాల అభివృద్ధి కోసం కృషిచేస్తున్న శ్యాంసుందర్ రెడ్డిని పలువురు ప్రశంసిస్తున్నారని ఆన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ రెడ్డి ని విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో కూడా వారి సహాయ సహకారాలు పాఠశాలకు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ ,విద్యార్థులు పాల్గొన్నారు.



# 100 అడుగుల జాతీయ జెండా పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్

**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి**
మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్ లో మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేయబడుతున్న 100 అడుగుల జాతీయ జెండా పనులను ఇటీవల పరిశీలించారు. ఈ జెండాను ఆగస్టు 15వ తారీఖున స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్ లో, సమాజానికి గౌరవప్రదమైన జాతీయ జెండాను స్థాపించడంలో ఒక ముఖ్యమైన అడుగు.మున్సిపల్ నిధులను ఉపయోగించి, ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడానికి చైర్మన్ తిరునగరు భార్గవ్ పర్యవేక్షణ చేస్తున్నారు. జెండా స్థలాన్ని పరిశీలించిన సమయంలో, పనుల పురోగతిని పరిశీలించి, త్వరగా పూర్తి చేసే విధానాలను చర్చించారు. ఆయన మాట్లాడుతూ, ఈ జెండా స్థానిక ప్రజల పట్ల గర్వాన్ని, దేశభక్తిని కలిగించడానికి మరియు ముఖ్యమైన వేడుకలకు స్ఫూర్తినిచ్చేందుకు కీలకమని చెప్పారు.మున్సిపల్ అధికారులు మరియు కాంట్రాక్టర్లతో కలసి, ఈ ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారు. ఈ జాతీయ జెండా ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్ కి ఒక ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని మరియు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఉత్సాహాన్ని తీసుకురావాలని భావిస్తున్నారు.





## ప్రమాదవశాత్తు కట్టర్ మీద పడి వ్యక్తి మృతి



**తరంగాలు/ భూపాలపల్లి:** కట్టర్ తో చెట్టు కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కట్టర్ మీద పడి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గోపాలపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన చదివెల్లి పోచయ్య (46)తన ఇంటి ముందు ఉన్న చెట్టును కరెంటు కట్టర్ తో కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కట్టర్ తనపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

## కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



**తరంగాలు ప్రతినిధి/ భువనగిరి నియోజకవర్గం** కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలోని నర్సాయిగూడెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వల్లపు నరసయ్య(60) తన వ్యక్తిగత పనుల నిమిత్తం వలిగొండకు వచ్చి తన టీవీఎస్ ఎక్సెల్ బండి పై తిరిగి వెళు తుండగా నరసయ్య గూడెం స్టేజి సమీపంలో రోడ్డు కల్వర్టు వద్ద టీఎస్ 09 ఈ క్యు 8452 నెంబర్ గల కారు ఢీకొట్టడంతో తనకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుని కూతురు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుజరుపుతున్నామని వలిగొండ ఎస్సై మహేందర్ తెలియజేశారు.

## జాబ్ క్యాలెండర్ విడుదలపై కే యూ విద్యార్థి నిరుద్యోగుల సంబరాలు



**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి** కాకతీయ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేడు శాసనసభలో జాబ్ క్యాలెండర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో కేయూ మొదటి గేటు వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పుష్పాభిషేకం, పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నరేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం నేడు శాసనసభలో జాబ్ క్యాలెండర్ ను ప్రకటించిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలైనా గత ప్రభుత్వం ఏనాడు నిరుద్యోగులకు పక్షాన నిలువలేదని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 30 వేల ఉద్యోగ నియామకాలు,సకాలంలో డీఎస్సీ నిర్వహణ, గ్రూప్ 2 వాయిదా,జాబ్ క్యాలెండర్ వంటి నిర్ణయాలు తీసుకుంటూ విద్యార్థి నిరుద్యోగుల పక్షపాతిగా ఉన్నారని వారికి విద్యార్థి లోకం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని అన్నారు,గత ప్రభుత్వాల హయంలో విద్యార్థి,నిరుద్యోగులు ఏ ఉద్యోగ నియామకాలు ఎప్పుడు వెలువడతాయో అర్థం కాని అయోమయంలో ఉండేవారని ప్రస్తుతం జాబ్ క్యాలెండర్ ద్వారా వారు ప్రిపేర్ అయ్యే పరీక్ష తేదీ ప్రకటన ద్వారా ప్రక్క ప్రణాళికతో చదివి,విజయం సాధిస్తారని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నరేష్, అభిరామ్ రమేష్,రమేష్ చంద్ర, సురేష్,రాజశేఖర్,అశోక్, పుష్పలీల,మొగిలి,రమ, నాగరాజు,నవీన్ తదితరులు పాల్గొన్నారు

# సాగర్ ఎడమ కాలువ నీటి విడుదలతో రైతుల సంబురాలు





### -ఎమ్మెల్యే -బి ఎల్ ఆర్

**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి** నాగార్జునసాగర్, రోడ్లు మరియు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సాగునీటిపారుదలశాఖామాత్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మరియు దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ మరియు పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తో కలిసి బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్ లో హిల్ కాలనీ, బుద్ధవనం, నాగార్జున సాగర్ చేరుకొని. నాగార్జున సాగర్ డ్యాం, లెఫ్ట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ నుంచి సాగునీరు విడుదల చేయడం జరిగింది. . అనంతరం పెద్దలు ప్రజా బంధువు కుందూరు జానారెడ్డి ఆధ్వర్యంలో సాగర్ వరద కాలువను విడుదల చేయడం జరిగింది.. ఈ సందర్భంగా రైతులు ఆనందంతో సంబురాలు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతుల ప్రభుత్వం అంటూ రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు..



## ఆగస్టు 5నుంచి 9వరకు స్వచ్ఛ ధనం -పచ్చ ధనం కార్యక్రమం




**తరంగాలు ప్రతినిధి/ జఫర్గడ్:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆగస్ట్ 5 నుంచి 9 వరకు జరిగే స్వచ్ఛ దనం -పచ్చ దనం కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతి కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల ప్రత్యేక అధికారి డా మనోహర్ , డివిజనల్ ప్రత్యేక అధికారి డి ఎల్ పి ఓ వెంకట్ రెడ్డి , యం ఆర్ ఓ శంకరయ్య , ఎంపీడీవో సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కుసుమంచిలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన

**-విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన**

**-కుసుమంచి మండల ఎస్టీ సెల్ కాంగ్రెస్ నాయకులు సురభి నాయక్**



**తరంగాలు/కూసుమంచి ఆర్సీ:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి (శనివారం) నేడు కుసుమంచి మండలంలో పర్యటించనున్నారని టూర్ ప్రోగ్రాం కాంగ్రెస్ కోఆర్డినేటర్ తంబూరి దయాకర్ రెడ్డి తెలిపినట్లు కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరావత్ సురభి నాయక్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్వర్ మాదారంలో మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి కుటుంబాన్ని, రాజుపేటలో విజయ రెడ్డి కుటుంబాన్ని ,జుజ్జులరావు పేటలో శేఖర్ రెడ్డి కుటుంబాన్ని, కుసుమంచిలో చెన్ను వెంకటరమణ కుటుంబాన్ని, నేలకొండపల్లి మండలం ముఠాపురం లో పలు కుటుంబాలను పరామర్శించనున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు శీనన్న అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఎస్సీల సమగ్రాభివృద్ధికే వర్గీకరణ తీర్పు

**-కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ కోటా రాంబాబు**

**-తెలంగాణలో మాదిగలకు దామాషా ప్రకారం 11.2శాతం రిజర్వేషన్లను అమలుచేయాలి**



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం :** ఎస్సీ లోని 59 కులాల సమగ్రాభివృద్ధికే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిందని, ఇది చారిత్రాత్మకమైనదని కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ కోటా రాంబాబు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్లో శుక్రవారం మాదిగ రిజర్వేషన్ ఉద్యమ నేతలతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కోటా రాంబాబు మాట్లాడుతూ... 1994, జూలై 7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో ప్రారంభించిన ఎస్సీ వర్గీకరణ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నాటి నుండి నేటి వరకు సపోర్ట్ చేస్తూనే ఉందన్నారు. మాదిగల 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటంలో సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనదన్నారు. తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 11.2 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కొరకు పోరాడిన మాదిగ అమర వీరులకు, మాదిగలకు, మద్దతు పలికిన కేంద్ర ప్రభుత్వానికి, తీర్పు వెలువడిన వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతిస్తూ విడుదలయ్యే ఉద్యోగ నోటిఫికేషన్ లో ఎస్సీ వర్గీకరణను అమలు చేసి తీరుతామని ప్రకటించినందుకు వారికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మాదిగ హక్కుల దండోరా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొర్రిపల్లి శ్రీనివాస్ మాదిగ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, టీఎస్ ఎంఆర్పిఎస్ జాతీయ నాయకులు ఎల్ వెంకటేశ్వరరావు నాయకులు, ముత్తయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## బూర్గంపాడు వాహన తనిఖీలలో భారీగా గంజాయి పట్టివేత.

**-అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.**



**తరంగాలు /భద్రాద్రి ప్రతినిధి /** ఈ రోజు బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారుగా 62,00,000/-(అరవై రెండు లక్షలు) రూపాయల విలువ గల 247 కేజీల నిషేధిత గంజాయిని వాహన తనిఖీలలో చాకచక్యంగా పట్టుకున్న సీసిఎస్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,ఎస్సైలు ప్రవీణ్, సుమన్ మరియు బూర్గంపాడు ఎస్సై రాజేష్ మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.నిషేధిత గంజాయి లాంటి మత్తుపదార్థాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే 8712682133/8712682135 నంబర్లకు సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా చేయడంలో జిల్లా ప్రజలు కూడా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు.

## ఫలక్నామా మహంకాళి అమ్మవారికి పూజలు చేసిన శ్రీసాయి సేవ సమితి అధ్యక్షురాలు

**-బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్**

**తరంగాలు ,ఆలేరు ఆర్సీ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన మద్దెల సాయిరాం గౌడ్ గత కొద్ది రోజుల క్రితం ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు . సాయిరాం గౌడ్ త్వరగా కోలుకోవాలని సంపూర్ణ ఆరోగ్యంగా ఇంటికి రావాలని హైదరాబాద్ లోని ఫలక్నామా మహంకాళి అమ్మ వారికి మాజీ రైతు బంధు జిల్లా కో ఆర్డినేటర్ ,



శ్రీసాయి సేవా సమితి అధ్యక్షురాలు బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ ఆషాడ బోనాల సందర్భంగా మహిమ గల్ల తల్లి , భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఫలక్నామా మహంకాళి మాత దేవాలయంలో అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మా తమ్ముడు మద్దెల సాయిరాం గౌడ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు . సాయిరాం గౌడ్ త్వరగా కోలుకోవాలని మొక్కుకుంటూ అమ్మ వారికి ముడుపు కట్టామని అన్నారు . కుటుంబ సభ్యులతో కలిసి మహంకాళి మాత అమ్మ వారి ఆశీస్సులు తీసుకున్నారు .

# ఉలర్ఝుతో ముందుకొచ్చిన జాన్వీ



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ శుక్రవారం ఉలర్ఝు చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, కథల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యాలు చేశారు. 'కెరీర్‌ను మార్చే అవకాశమైనా.. జుట్టు లేకుండా కనిపించే పాత్రను అంగీకరించను అన్నారు. 'ఎలాంటి పాత్రలో నటించకూడదని నిర్ణయించుకున్నారు?' అని యాంకర్ అడగ్గా జాన్వీ స్పందించారు. హెయిర్ లేకుండా నటించాల్సి వస్తే నేనెప్పుడూ సున్నితంగా తిరస్కరిస్తా. ఎంత కష్టమైన పాత్రైనా చేస్తాను కానీ జుట్టు లేకుండా కనిపించేందుకు ఇష్టపడను. 'ఉలర్ఝు'లోని పాత్ర కోసం దర్శకుడు నా హెయిర్‌ను కొంత కట్ చేయాలని సూచించారు. అందుకు నేను ఆయనతో గొడవపడ్డా నా తొలిసినిమా 'ధడక్' కోసం జుట్టు కత్తిరించుకున్నా. 'ఎందుకిలా చేశావ్?' అంటూ మా అమ్మ అరిచింది. ఏ రోల్ కోసమైనా హెయిర్ కట్ చేసుకోవద్దని చెప్పింది. నా జుట్టంటే ఆమెకు అంత ఇష్టం. మూడ్రోజులకోసారి ఆయిల్ రాసి మసాజ్ చేస్తది. అమ్మ కారణంగానే హెయిర్ కట్ చేసుకోను' అని అంది జాన్వీకపూర్. గుల్షన్ , జాన్వీకపూర్, రోషన్ మాథ్యు కలిసి నటించిన చిత్రమిది. దేశభక్తి కథాంశంతో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్‌గా రూపొందింది. జాతీయ అవార్డు గ్రహీత సుధాన్షు సరియా దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆమె తెలుగులో దేవర చిత్రంలో నటిస్తోంది. రెండు పార్టులుగా ఈ చిత్రం తెరకెక్కనుంది. తదుపరి రామ్‌చరణ్, సానా బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కే చిత్రంలో ఆమె అవకాశం అందుకుంది.



# విక్రమ్ తంగలాన్ వార్ సాంగ్ ప్రోమో అదిరిందంతే.!

లీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ నటిస్తోన్న హిస్టారికల్ డ్రామా ప్రాజెక్ట్ తంగలాన్ పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమా కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగే ఘటనల నేపథ్యంలో విక్రమ్ థ్రిల్లింగ్, అడ్వెంచరస్ రైడ్‌గా ఉండబోతున్నట్టు ఇప్పటికే లాంచ్ చేసిన ట్రైలర్‌తో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ చిత్రం ఆగస్టు 15న తెలుగు,తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఏదో ఒక అప్‌డేట్‌తో మూవీ లవర్స్‌తోపాటు విక్రమ్ అభిమానులను ఖుషీ చేస్తున్న మేకర్స్ తాజాగా తంగలాన్ వార్ సాంగ్ (తమిళ్)ప్రోమోను విడుదల చేశారు. జీవీ ప్రకాశ్‌కుమార్, అరివు పాడిన ఈ పాట సినిమా థీమ్ ఎలా ఉండబోతుందో తెలియజేసేలా సాగుతూ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. తంగలాన్‌ను స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేళ్ రాజా తెరకెక్కిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఇప్పటికే తంగలాన్ నుంచి షేర్ చేసిన విక్రమ్, మాళవికా మోహనన్ ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. బంగారం, రక్తం, కన్నీటి చుట్టూ సాగే కథగా అడ్వెంచరస్ స్టోరీ నేపథ్యంలో తంగలాన్ ఉండనుందని ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెబుతున్నాయి.




# కృతి సనన్ ప్రేమలో పడ్డారా ?? బాలీవుడ్ లో హాట్ టాపిక్

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ ప్రేమలో పడ్డారా? ప్రజెంట్ బాలీవుడ్ సర్కిల్స్‌లో ఇదే హాట్ టాపిక్. తన కన్నా పదేళ్లు చిన్నవాడితో ఈ బ్యూటీ డేటింగ్‌లో ఉన్నారన్న న్యూస్ నార్త్ ఇండస్ట్రీలో తెగ హల్ చల్ చేస్తోంది. ఇంతకీ ఈ రూమర్స్ ఎందుకింత వైరల్ అవుతున్నాయి. హావ్ ఏ లుక్ నిర్మాతగా తన తొలి సినిమా దో పత్తి రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్న కృతి సనన్, ఆ మూవీ రిలీజ్‌కు ముందు గ్రీస్‌లో చిల్ అవుతున్నారు. ఈ ట్రిప్‌కు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు కొత్త డౌట్స్ రెయిజ్ చేస్తున్నాయి. కబీర్ బహియాతో కలిసి కృతి గ్రీస్ ట్రిప్‌లో ఉండటంతో ఈ ఇద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. కృతి విషయంలో డేటింగ్ రూమర్స్ ఇప్పుడే మొదలైనవేం కాదు. గతంలోనూ కబీర్, కృతి రిలేషన్‌కు సంబంధించిన వార్తలు ట్రెండ్ అయ్యాయి. కృతి బర్త్ డేను కబీర్‌తో కలిసే సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ ఫోటోస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో కొన్ని ప్రైవేట్ పార్టీస్‌లోనూ ఈ జంట చెట్టా పట్టాలేసుకు కనిపించింది. అయితే కృతి, కబీర్ విషయంలో ఏజ్ గ్యాప్ కూడా ఇంట్రస్టింగ్‌గా మారింది. కబీర్, కృతి కన్నా పదేళ్లు చిన్నవాడు కావటంతో ఈ ఇద్దరి రిలేషన్ గురించి స్పెషల్‌గా మాట్లాడుకుంటున్నారు ఇండస్ట్రీ జనాలు. అయితే మీడియా సర్కిల్స్‌లో ఇంత డిస్కషన్ జరుగుతున్నా కృతి మాత్రం తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి క్లారిటీ ఇవ్వలేదు



# ఓటీటీలోకి ప్రియదర్శి డార్లింగ్

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటించిన యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ 'డార్లింగ్'. జూలై 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనను తెచ్చుకుంది. ఇప్పుడు ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. కథ విషయానికి వస్తే.. ఒక ట్రావెల్ ఏజెన్సీలో పని చేసే రాఘవకు పెళ్లి చేసుకొని హనీమూన్‌కు పారిస్ వెళ్లాలని కలలు కంటూ ఉంటాడు. ఈక్రమంలో ఒకటి రెండు సంబంధాలు పెళ్లి వరకు వచ్చి డిప్రెషన్‌లోకి వెళతాడు. అలాంటి సమయంలో ఆనంది (నభ నటేష్) పరిచయం అవడం, వివాహం చేసుకోవడం జరిగి పోతాయి. తీరా అసలువిషయం అప్పుడే మొదలవుతుంది. ఆనందికి మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్ అనే వ్యాధి ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో ఆమె ఏ నిమిషం ఎలా ఉంటుంది, ఎలా ప్రవర్తిస్తుందనే విషయం అసలు అంతుచిక్కదు. ఈ నేపథ్యంలో రాఘవ ఆనందితో ఎలా కాపురం చేశాడు, హనీమూన్ కల తీరిందా లేక ఇద్దరూ విడిపోయారా? అసలు ఆనంది ఎవరు, ఆమె నేపథ్యం ఏంటి? ఆమె గతం గురించి తెలిసిన రాఘవ చివరికి ఏమి చేశాడు? అనే ఆసక్తికరమైన కథకథనాల చుట్టూ సినిమా సాగుతూ నవ్వులు పూయిస్తుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని నెల రోజులలోనే ఈ నెల 13వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు తీసుకు వస్తున్నారు. సో ఎవరైతే థియేటర్లలో మిస్సయ్యారో ఇక ఇంట్లోనే కుటుంబంతో కలిసి చూసి ఆనందించండి.

# అక్షయ్ ఖేల్‌ఖేల్‌మే ట్రైలర్ విడుదల

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్, తాప్సీ పన్ను ప్రధాన పాత్రల్లో వస్తున్న తాజా చిత్రం 'ఖేల్ ఖేల్ మే'. ఈ సినిమాకు ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. కామెడీ , ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో వాణి కపూర్, అమ్మీ విర్క్, ఆదిత్య సీల్, ప్రగ్యా జైస్వాల్, ఫర్దీన్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడటంతో మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తే.. తమిళంలో హిట్ అయిన లవ్ టూడే సినిమా స్టోరీ కాన్సెప్ట్‌తో ఈ మూవీ రాబోతున్నట్లు తెలుస్తుంది. అక్షయ్ కుమార్, తాప్సీ, వాణి కపూర్ అంతా ఫ్రెండ్స్. ఒక పార్టీలో వీళ్లందరు కలుసుకోని ఒక గేమ్ ఆడదాం అనుకుంటారు. ఇంతకీ ఆ గేమ్ ఏంటి అంటే.. అందరు తమ ఫోన్స్ అన్ లాక్ చేసి చూపించాలి. అయితే ఆ ఫోన్స్‌లో ఏం ఉంది అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రస్తుతం జనరేషన్‌లో మొబైల్స్‌కి అలవాటు పడిన జనాలు ఏం చేస్తున్నారు. ఏం చూస్తున్నారు అనే స్టోరీతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ చిత్రం 2016 ఇటాలియన్ కామెడీ థ్రిల్లర్ 'పర్ఫెక్ట్ స్టేం÷–రజర్స్ కి రీమేక్.




Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com